అధ్వానంగా రోడ్లు

● భోలక్‌పూర్‌లో ఇబ్బందులు పడుతున్న ప్రజలు ● మేయర్ ఆదేశించినా మంజూరు కాని నిధులు



సిద్దిక్‌నగర్‌లో గుంతలమయంగా మారిన రోడ్డు

ముషీరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌లో రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ రోడ్ల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ ప్రాంతంలో రోడ్లు బాగు చేయాలని గ్రేటర్ హైదరాబాద్ మేయర్‌కు విన్నవించడంతో ఆమె భోలక్‌పూర్‌లో పర్యటించి రోడ్ల నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అయినా నేటికీ నిధులు మంజూరు కాలేదు. దీంతో రోడ్ల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అధికారులు సైతం రోడ్ల మరమ్మతులు చేపట్టలేకపోవడంతో రోడ్లు గుంతలమయంగా మారాయి. ఫలితంగా ప్రజల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

పైపులైన్ పనులు పూర్తయి ఆరు నెలలైనా..

భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్, గుల్షన్‌నగర్, తాజీర్‌నగర్, రంగానగర్, సిద్దిక్‌నగర్ తదితర ప్రాంతాలలో రోడ్లు గుంతలమయంగా మారి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తి అయి నెలలు గడుస్తున్నా ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టకపోవడం వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులకు స్థానిక ప్రజా ప్రతినిధులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఇందిరానగర్‌లో రోడ్డు పరిస్థితి



రంగానగర్‌లో కంకర తేలిన రోడ్డు

మేయర్ పర్యటించినప్పటికీ..

భోలక్‌పూర్ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు గౌసుద్దీన్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో భోలక్‌పూర్ రోడ్లపై పలుమార్లు ప్రస్తావించగా గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఇటీవల భోలక్‌పూర్‌లో పర్యటించారు. రూ.కోటి 50 లక్షలతో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయినప్పటికి నేటికీ నిధులు మంజూరు కాలేదు.

త్వరలో పనులు చేపడతాం



భోలక్‌పూర్‌లో అధ్వానంగా మారిన రోడ్లను గుర్తించి జీహెచ్‌ఎంసీ కమీషనర్‌కు ఫిర్యాదు చేశాం. వెంటనే నిధులు మంజూరు చేసి రోడ్లను ఆధునికీకరించాలని కోరాం. త్వరిత గతిన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

- ముఠా గోపాల్, ఎమ్మెల్యే

బడ్జెట్ మంజూరైన వెంటనే పనులు చేపడతాం

రోడ్లపై ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేశాం. ఇప్పటికే రెండు ప్రాంతాలలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. బడ్జెట్ నిధులు మంజూరైన వెంటనే మిగతా రోడ్లు సైతం ఆధునికీకరిస్తాం.

- సన్నీ, జీహెచ్‌ఎంసీ డీఈఈ

జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాం



భోలక్‌పూర్ డివిజన్‌లో అధ్వానంగా మారిన రోడ్లపై జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు ఫిర్యాదు చేశాం. రోడ్లను ఆధునికీకరించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరాం. ప్రజలు ప్రమాదాలకు లోనవుతున్నారని ఫిర్యాదు చేశాం.

- వాజీద్ హుస్సేన్, భోలక్‌పూర్ మాజీ కార్పొరేటర్

రోడ్డు వేయడం మరిచారు



ఇందిరానగర్‌లో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా కనీసం గుంతల వద్ద ప్యాచ్‌వర్క్ పనులు కూడా చేపట్టలేదు. స్థానిక ప్రజలు, వాహనదారులు ఆ గుంతల్లో అదుపు తప్పి కిందపడిపోతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

- ఎన్.నర్సింహ, ఇందిరానగర్ కమిటీ ప్రధాన కార్యదర్శి



గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన చైర్మన్, కార్యదర్శులు

గ్రంథాలయాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

చిక్కడపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన కె.ఉపేందర్‌రెడ్డి బుధవారం నగరంలోని 10 శాఖా గ్రంథాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూసారాంబాగ్, నాగార్జుననగర్ కాలనీ, ఉమెన్స్ మలక్‌పేట, సంతోష్‌నగర్, న్యూమలక్‌పేట, ఓల్డ్ మలక్‌పేట, సర్వకస్సల్దన్, కృష్ణానగర్, నూతనంగా నిర్మిస్తున్న ఆజంపుర గ్రంథాలయం, నూతనంగా రిపేర్ చేయబడిన కట్టెలగూడ గ్రంథాలయాలను తనిఖీ చేశారు. గ్రంథాలయంలో పోటీపరీక్షలకు చదువుతున్న విద్యార్థులు, పాఠకులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయంలో చైర్మన్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. పదేళ్లుగా గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం కోసం ప్రభుత్వం త్వరలో తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ, గ్రంథపాలకులు రమేష్, శంకర్, మహేందర్, కృష్ణారెడ్డి, వెంకటాచారి, శిరీష, ఉమారాణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కరెంట్ వైర్లపై పడిన గాలిపటాల తొలగింపులో భాగంగా గురువారం ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నారెడ్డినగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రేమ్‌నగర్, అహ్మద్‌నగర్, పోచమ్మ దేవాలయం, సమోసా కార్ఖానా తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



త్రినాథరావును సన్మానిస్తున్న స్వామి తదితరులు

త్రినాథరావుకు సత్కారం

చిక్కడపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ మాజీ ఏజీఎం, ప్రముఖ గాయకుడు డా. చింతలపూడి త్రినాథరావు సంగీత రంగానికి చేసిన సేవలను గుర్తించిన ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ ఆంధ్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను గానసుధా సాగర బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ.. ఘంటసాల శతజయంతి సందర్భంగా సంవత్సరం పాటు రోజుకో పాట చొప్పున 366 ఘంటసాల పాటలు పాడి రికార్డు నెలకొల్పిన త్రినాథరావును తమ సంస్థ స్వర్ణోత్సవాల సందర్భంగా సత్కరించుకోవడం తమకు లభించిన గొప్ప అవకాశం అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో తనకు సన్మానం జరగడం సంతోషం కలిగించిందని త్రినాథరావు పేర్కొన్నారు. జానపద నాట్య కళాకారులు నటరాజ్‌భట్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్ పట్నాయక్ పాల్గొన్నారు.

'అంబర్‌పేటలో చెత్తను తొలగించాలి '

అంబర్‌పేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ సమస్యలకు అడ్డాగా మారిందని బీజేపీ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ మైలారం రాజు ఆరోపించారు. పటేల్‌నగర్ హనుమాన్ మందిరం పక్కన ఉన్న చెత్తవేసే స్థలం పటేల్‌నగర్ నుంచి న్యూప్రేమ్‌నగర్ గ్రీన్‌ల్యాండ్ వరకు విస్తరించిందని ఇరు బస్తీవాసులు పేర్కొన్నారు. చెత్త ఉన్న స్థలం తమది కాదంటే తమది కాదని పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్‌వాసులు చెబుతున్నారు. గ్రీన్‌ల్యాండ్ కాలనీలో ఆకతాయిల ఆగడాలు ఎక్కువవుతున్నాయని, తగుచర్యలు తీసుకోవాలని లేదంటే ధర్నా చేస్తామని హెచ్చరించారు.

డివిజనల్ రైల్వే యూజర్ల కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా నర్సింగ్‌రావు

నల్లకుంట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నల్లకుంట డివిజన్ కన్వీనర్‌గా సేవలందించిన కే.బీ.నర్సింగ్‌రావు డివిజనల్ రైల్వే యూజర్ల కన్సల్టేటివ్ కమిటీ హైదరాబాద్ డివిజన్స్ సౌత్ సెంట్రల్ రైల్వే సభ్యుడిగా నియమితులయ్యారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు చేతుల మీదుగా బుధవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్.గౌతమ్‌రావు, నల్లకుంట కార్పొరేటర్ యాకర.అమృతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బస్తీవాసుల సమస్యలు పరిష్కరిస్తా

అంబర్‌పేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ బుధవారం డివిజన్‌లోని అహ్మద్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీవాసుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



అహ్మద్‌నగర్‌లో సమస్యలు ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్



నేతికార్ సురేష్‌లాల్‌ను సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నేతలు

రవాణా రంగ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తా

బర్కత్‌పుర, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రవాణా రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలంగాణ రాష్ట్ర రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ నేతికార్ సురేష్‌లాల్ తెలిపారు. రవాణా రంగ కార్మికులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమన్నారు. బుధవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో రవాణా రంగ కార్మికులను పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రవాణారంగ కార్మికులకు తగు న్యాయం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ గ్రేటర్ అధ్యక్షుడు దయానంద్, నాయకులు రాజిరెడ్డి, నర్సింహారెడ్డి, మల్లేష్‌గౌడ్, రాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎం.డి.మహబూబ్, దీపక్, జలీల్, నాగమల్లు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యాదవ్ రాఖీవాలా వ్యవస్థాపకుడు మృతి

గోల్నాక, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ అంబర్‌పేట సీపీఎల్ రోడ్ తిరుమలనగర్‌లో నివాసం ఉంటున్న బీజేపీ సీనియర్ నాయకుడు, యాదవ్ రాఖీవాలా వ్యవస్థాపకుడు కోత్మీర్ సురేష్‌యాదవ్(74) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. టీడీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో సుదీర్ఘకాలంగా కొనసాగిన సురేష్‌యాదవ్ ఆరేళ్ల క్రితం కిషన్‌రెడ్డి సారథ్యంలో బీజేపీలో చేరారు. సురేష్‌యాదవ్ మరణ వార్త తెలియడంతో బీజేపీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, సన్నిహితులు, యాదవ కులపెద్దలు ఆయన నివాసానికి వచ్చి నివాళులర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉంది. బుధవారం హర్రాస్‌పెంటలోని అంబర్‌పేట హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఔత్సాహిక గాయనీ గాయకులను ప్రోత్సహించాలి

చిక్కడపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక గాయనీగాయకులను ప్రోత్సహించాలని శ్రీ సాయిసంగీత లహరి సంస్థ అధ్యక్షుడు రామప్రసాద్ అన్నారు. సాయి సంగీత లహరి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో మధురగీతాల ఆలాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గాయనీ గాయకులు రామప్రసాద్, శ్రీదేవి, నాగమణి, రాదారాణి, సరోజ, విజయలక్ష్మి, నాగేశ్వరరావు, నాగరాజారావులు గీతాలు ఆలపించారు.

కేంద్రంలోని బీజేపీ పాలనలో ప్రతిష్టాత్మక నిర్ణయాలు



సంవిధాన్ గౌరవ అభ్యాన్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు

చిక్కడపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని పలు బస్తీల్లో బుధవారం సంవిధాన్ గౌరవ అభ్యాన్ కార్యక్రమంలో భాగంగా భారతరత్న డా.బిఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించి ప్రధాని నరేంద్రమోదీ పాలనలో బీజేపీ రాజ్యాంగాన్ని గౌరవించే విధానాన్ని ప్రజలకు తెలియజేసే కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వీవీ గిరినగర్, వాల్మీకినగర్ బస్తీల్లో సమావేశాలు నిర్వహించారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో 370 ఆర్టికల్, త్రిపుల్ తలాక్ తొలగించడం ఎంతో గర్వించదగ్గ ప్రతిష్టాత్మక నిర్ణయాలు అని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ భారతదేశంలో ఉంటూ భారత దేశంతో పోరాటం చేస్తాననడం ఎంతవరకు సమంజసం అని అసహనం వ్యక్తం చేశా రు. బీజేపీ సీనియర్ నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, సురేష్, ఆకుల సురేందర్, శ్రీనివాస్, సాయికుమార్, యాదగిరి, సత్యేందర్, సాయికృష్ణ, నీరజ్, ధీరజ్, ప్రకాష్, బస్తీవాసులు నిర్మల, లావణ్య, రేణుక, ప్రేమలత, శ్రీలత, అనురాధ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ జయగోపాల్‌కు పెరియార్ అవార్డు



జయగోపాల్‌కు పెరియార్ అవార్డు ప్రదానం చేస్తున్న డా.వీరమణి, వేదాంత్ మౌర్య

కవాడిగూడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నాస్తికవాది, అంతర్జాతీయ హక్కుల నాయకులు, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ జయగోపాల్‌కు మరణాంతరం చెన్నైలోని ద్రవిడ కజగం పెరియార్ తమిళ్ పోరంచే సాంఘిక ఉద్యమకారుడు పెరియార్ అవార్డును ఈనెల 15న డాక్టర్ కె.వీరమణి అందించినట్లు సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేదాంత్ మౌర్య వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఏపీ, తెలంగాణకు చెందిన నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారని తెలిపారు. దేశంలోని 8 రాష్ట్రాలలో విరివిగా మూఢ నమ్మకాల నిర్మూలనకై హక్కుల సాధన కోసం కృషి చేసిన గుర్తింపుగా ప్రతిష్టాత్మక పెరియార్ అవార్డు అందించడం జరిగిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ హేమలత

భారత రాజ్యాంగం చాలా గొప్పది

కవాడిగూడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం చాలా గొప్పదని, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అని జీహెచ్‌ఎంసీ ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత అన్నారు హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాంనగర్, నల్లకుంట జోన్ స్థాయి హైస్కూల్ విద్యార్థుల పోటీల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. పిల్లలలో దేశభక్తిని పెంపొందించడానికి, సమాజ అవగాహన పెంచడానికి హైదరాబాద్ జిందాబాద్ మంచి ప్రయత్నం చేస్తోందన్నారు. ఇరిగేషన్ రిటైర్డ్ గెజిటెడ్ ఆఫీసర్ భవానీశంకర్, హైదరాబాద్ జిందాబాద్ కార్యదర్శి కె.వీరయ్య, నాయకులు నాగేశ్వరరావు, మోహన్‌నాయుడు, శ్రీనివాసరావు, సంగీత, సైదులు, మేఘన, సుకుమార్, మహేందర్, రమేష్, శంకరయ్య పాల్గొన్నారు.

'కిడ్నీ రాకెట్ ముఠాను కఠినంగా శిక్షించాలి'

నల్లకుంట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని అడ్డుపెట్టుకుని అమాయకుల కిడ్నీల మార్పిడికి యత్నిస్తున్న ముఠాలను కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ దువ్వూరు ద్వారకానాథరెడ్డి, వి.అశోక్‌లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగరంలోని అలకనంద ఆస్పత్రిలో కిడ్నీల దానానికి వచ్చిన బాధితులను, కిడ్నీల మార్పిడికి వచ్చిన రోగులను, ఆస్పత్రి యాజమాన్యంను టాస్క్‌ఫోర్స్ బృందం అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. బుధవారం హైదర్‌గూడలో వారు విలేకరులతో మాట్లాడుతూ కిడ్నీ అడ్వయిజరీ కమిటీ నమోదైన పేర్లలోని వ్యక్తుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి కిడ్నీ మార్పిడికి అనుమతి ఇవ్వడం జరుగుతుందని వారన్నారు.

'అందరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి'

ముషీరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకొని పేదలను ఆదుకోవాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లోని బ్రహ్మంగారి దేవాలయం వీధిలో క్రిస్మస్ ఫీస్ట్ వేడుకలను బీఆర్ఎస్ నాయకుడు కృపావరం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముఠా జైసింహ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని అన్నారు. వృద్ధాప్యంలో ఉన్న పెద్దలను చీదరించుకోకుండా వారిని అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలిండియా ప్రేయర్ పవర్ చర్చ్‌స్ డైరెక్టర్ శ్యామ్‌అబ్రహ్మం, పాస్టర్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యత అవార్డుకు డా.అచ్యుతదేవి ఎంపిక

బర్కత్‌పుర, జనవరి22 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్న రాజా బహదూర్ వెంకట్రామ్ రెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్యుతదేవిని జాతీయ ఐక్యత అవార్డు 2025కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు. బర్కత్‌పురలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నాంపల్లిలోని పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఓయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎ.కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ అవార్డును ప్రదానం చేస్తారని, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నారాయణ, ప్రముఖ హాస్యనటుడు డాక్టర్ పృథ్వీరాజ్, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ బాలాచారి తదితరులు పాల్గొంటాని తెలిపారు.

నిలోఫర్ ఆస్పత్రిలో సదుపాయాలు అధ్వానం



మాట్లాడుతున్న పి.సాయిబాబా

కవాడిగూడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పేరొందిన నిలోఫర్ ఆస్పత్రిలో బాత్రూమ్‌లు, మరుగుదొడ్లు ఇతర సదుపాయాలు అధ్వానంగా ఉన్నాయని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ఆరోపించారు. బుధవారం దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. పిల్లల ఆస్పత్రిని ప్రభుత్వం పట్టించుకునే స్థితిలో లేదన్నారు. ఉస్మానియా ఆస్పత్రి శిథిలావస్థలో ఉండి పై కప్పులు కూలిపోతున్నాయని వాపోయారు. వైద్యులు, మందుల కొరతతో ఉస్మానియా ఆస్పత్రి దీనస్థితిలో ఉందని విమర్శించారు. ఉస్మానియా ఆస్పత్రి ప్రభుత్వ నిర్లక్ష్యంగా నరకకూపంగా మారిందని ధ్వజమెత్తారు. మందుల కొరత నివారించాలని, వైద్యులను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

పార్కుల సుందరీకరణకు చర్యలు: ఎమ్మెల్యే



పార్కులో బోర్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్ యాకర అమృత తదితరులు

నల్లకుంట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లో పార్కుల సుందరీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని న్యూనల్లకుంట నరేంద్రనగర్ పార్కులో కార్పొరేటర్ యాకర అమృతతో కలిసి ఎమ్మెల్యే బోర్‌వెల్ పనులను ప్రారంభించి మాట్లాడారు. నల్లకుంటలోని అన్ని పార్కులలో మొక్కలు, పాత్‌వే, పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలను లక్షలాది రూపాయల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

113 పరుగులతో చెన్నై జట్టు విజయం



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న కోదండరెడ్డి, చిత్రంలో వి.హనుమంతరావు, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

బర్కత్‌పుర, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ అండర్ 19 ట్వంటీ20 క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై జట్టు విజయం సాధించింది. మొదలు బ్యాటింగ్ చేసిన చెన్నై జట్టు 20 ఓవర్లలో 185 పరుగులు సాధించింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన బిహార్ జట్టు 72 పరుగులకే ఆలౌట్ అయిం ది. చెన్నై జట్టు 113 పరుగుల తేడా తో విజయం సాధించింది. చెన్నై జట్టుకు చెందిన కరన్‌కన్నాన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, క్రికెట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శంభుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ మమత సంతోష్‌గౌడ్, ఆర్.లక్ష్మణ్‌యాదవ్, నాగభూషణం, అమర్‌జీత్‌కుమార్, సయ్యద్ సాధిక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు

బర్కత్‌పుర, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. బుధవారం డివిజన్‌లోని చప్పల్‌బజార్ చిన్నమసీదు వద్ద 15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. అవసరమైన ప్రాంతాలలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, బాబన్న, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, కిషోర్ పాల్గొన్నారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి



రజత పతకం సాధించిన తెలంగాణ జట్టు

నేషనల్ ఐస్‌కర్లింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు రజత పతకం

బర్కత్‌పుర, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో ఈనెల 17 నుంచి 21 వరకు జరిగిన నాల్గవ నేషనల్ ఐస్ కర్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో తెలంగాణ సీనియర్స్ ఉమెన్స్ జట్టు రజత పతకం సాధించిందని కర్లింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి బి వసంతమాదురి తెలిపారు. ఇక్కడ జరిగిన నేషనల్ చాంపియన్ షిపల్‌లో 18 రాష్ట్రల నుంచి 300పైగా క్రీడాకారులు పాల్గొన్నారని తెలంగాణ సీనియర్స్ ఉమెన్స్ టీమ్ లో ఎం నాగఅక్షయ, కె స్టెల్లా, దీపిక, రచ్చేల్, వసంతమాధురి నైపుణ్యం సాధించి రజత పతాకాన్ని సాధించారని తెలిపారు.

మధురంగా అక్కినేని చిత్రాల గాన లహరి

చిక్కడపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అర్చన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో అక్కినేని చిత్రాల గానలహరి మధురంగా సాగింది. ఘంటసాల, సుశీల పాడిన పాటలను సంస్థ నిర్వాహకులు అర్చన వెంకటేశ్వరరావుతో పాటు రమణి, దమయంతి, శారద, చింతలపాటి మూర్తి, శేఖర్, శేఖరుడు ఆలపించి తమ గానంతో ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు వి. సతీష్, వై ప్రకాష్‌రావు పాల్గొని గాయనీగాయకులను అభినందించారు.



గంజాయి విక్రయదారులను పట్టుకున్న ముషీరాబాద్ ఎక్సైజ్ సీఐ రామకృష్ణ, ఎస్సైలు

గంజాయి విక్రయదారుల అరెస్టు

ముషీరాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ముషీరాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్‌కు చెందిన గుడ్డు కుమార్, సంతుకుమార్‌లు దోమలగూడలోని ఎన్‌టీఆర్ స్టేడియం వద్ద గంజాయి విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి వారిని పట్టుకున్నారు. వారి నుంచి 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తీసుకువచ్చిన ఆటో, సెల్‌ఫోన్‌లు సీజ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.